**శూన్య ఉద్గారాలు**

నాగ్‌పూర్‌లో అన్ని భవనాలను 2050 నాటికి శూన్య ఉద్గారాలు సాధించేలా చేయాలని ప్రణాళిక రూపొందించారు. దేశంలో శూన్య ఉద్గారాల భవన నిర్మాణ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించిన తొలి నగరం ఇదే. ప్రపంచంలో ఈ తరహా ప్రణాళిక రూపొందించిన ఆరో నగరం ఇది.

# సహకార సమాఖ్య స్ఫూర్తి.. రాష్ట్రాలతో దేశానికి శక్తి

## నీతి ఆయోగ్

- దేశంలో 1950, మార్చి 15న ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేశారు. 2014, మే 29న ఇండిపెండెంట్ ఎవాల్యుయేషన్ ఆఫీస్ ప్రణాళికా సంఘం స్థానంలో విధాన సంఘం (పాలసీ కమిషన్) ఏర్పాటు చేయాలని నివేదిక సమర్పించింది. కేంద్ర మంత్రి వర్గం 2014, ఆగస్ట్ 13న ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి, దాని స్థానంలో 2015, జనవరి 1న నీతి ఆయోగ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫామింగ్ ఇండియా)ను ఏర్పాటు చేసింది.
- నీతి ఆయోగ్ చైనా అనుసరిస్తున్న NDRC (నేషనల్ డెవలప్‌మెంట్ రీఫామ్స్ కమిషన్) లాగా పని చేస్తుంది.
- నీతి ఆయోగ్‌ను కేంద్ర ప్రభుత్వ మంత్రి మండలి తీర్మానం ద్వారా ఏర్పాటు చేశారు.
- దీనికి రాజ్యాంగ బద్ధత, చట్ట బద్ధత ఉండదు.
- ఈ సంస్థ 'సహకార సమాఖ్య' స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్రాల అభివృద్ధి, మొత్తం దేశాభివృద్ధికి అవసరమైన, విధానపరమైన కీలక నిర్ణయాలు తీసుకుంటుంది.

## నీతి ఆయోగ్ లక్ష్యాలు, ప్రాధాన్యతలు

- ఆర్థిక విధానాల రూపకల్పనలో రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేటట్లు చేయడం ముఖ్య లక్ష్యం. ప్రణాళిక సంఘం అనుసరించి పై నుంచి కిందికి (టాప్ టు బాటం) పద్ధతికి భిన్నంగా కింది నుంచి పైకి (బాటం నుంచి టాప్) పద్ధతిని అనుసరించడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ మార్పు ద్వారా దేశాన్ని సహకార ఫెడరల్ వ్యవస్థగా మార్చాలని నిర్ణయించారు. దీని ద్వారా పోటీ పూర్వక సమాఖ్య తత్వం పెంపొందుతుంది.

**ముఖ్య విధులు**

1. జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా జాతీయాభివృద్ధి ప్రాధాన్యతలను, రంగాలను వ్యూహాలను నిర్ధారించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు పాల్గొనేటట్లు చేయడం
2. బలమైన రాష్ట్రాలతో బలమైన దేశం ఏర్పడుతుంది. కాబట్టి నిరంతరం రాష్ట్రాల ప్రోత్సాహక ప్రక్రియల ద్వారా సహకార ఫెడరల్ వ్యవస్థను నిర్మించడం
3. సమర్థవంతంగా గ్రామ స్థాయి ప్రణాళికలు తయారు చేసి, వాటిని హెచ్చు స్థాయి ప్రభుత్వ ప్రణాళికలతో సంఘటితం చేయడం
4. ఆర్థిక విధానాల వ్యూహాల రూపకల్పనలో దేశ భద్రత అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం
5. ఆర్థికాభివృద్ధి ఫలాలను ప్రయోజనాలు పొందలేని వర్గాల వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం
6. దీర్ఘకాల వ్యూహాలను, పథకాలను రూపొందించి వాటి అమలును పర్యవేక్షిస్తూ, అనుభవాలను గ్రహిస్తూ మధ్యంతర సమయాల్లో తగిన మార్పులు చేస్తూ వాటి సామర్థ్యాన్ని పెంచడం
7. జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, విద్య, పరిశోధన రంగాల్లోని నిష్ణాతుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి, విస్తృతపర్చడం
8. ఈ అనుభవజ్ఞులు, నిపుణుల సహకారంతో దేశంలో వ్యవస్థాపక నైపుణ్యాన్ని, నవ కల్పనలు, పరిజ్ఞానాన్ని పెంపొందించడం
9. అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అన్ని రంగాలు, అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధిని వేగవంతం చేయడం
10. నిలకడగల, సమాన అభివృద్ధికి అవసరమైన సుపరిపాలన, మెరుగైన పద్ధతులను సూచించడానికి స్టేట్ ఆఫ్ ఆర్ట్ రీసోర్స్ సెంటర్‌ను నిర్వహించడం
11. అభివృద్ధి పథకాలు మంచి ఫలితాలనిస్తూ, సమాన పంపిణీ జరిగేట్లు చేయడానికి చురుకైన పర్యవేక్షణ, అమలు పద్ధతులను అవలంబించడం
12. అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి సాంకేతిక పరిజ్ఞానం పెంపుదల, నైపుణ్యాల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం
13. జాతీయాభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి అమలు చేయాల్సిన ఏ ఇతర విధానాన్నయినా అనుసరించడం

## నీతి ఆయోగ్ ప్రస్తుత సభ్యులు

- అధ్యక్షుడు/ చైర్‌పర్సన్– నరేంద్ర మోదీ (ప్రధాన మంత్రి)
- ఉపాధ్యక్షుడు– సుమన్ కే బేరీ
- ఎక్స్ అఫీషియో సభ్యులు– 1) రాజ్‌నాథ్ సింగ్ (కేంద్ర రక్షణ శాఖ మంత్రి)

2) అమిత్ షా (కేంద్ర హోం శాఖ మంత్రి)
3) నిర్మలా సీతారామన్ (కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి)
4) నరేంద్ర సింగ్ తోమర్ (కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి)

**ప్రత్యేక ఆహ్వానితులు**

1) నితిన్ గడ్కరీ (రోడ్లు, హైవేస్ మంత్రి)
2) పీయూష్ గోయల్ (వాణిజ్య, పరిశ్రమలు, ఆహార, పీడీఎస్ మంత్రి)
3) రావ్ ఇందర్‌జీత్ సింగ్ (గణాంక, ప్రణాళిక శాఖ మంత్రి, స్వతంత ప్రతిపత్తి)
4) వీరేంద్ర కుమార్ (సామాజిక న్యాయం, సాధికారత మంత్రి)
5) అశ్వినీ వైష్ణవ్ (రైల్వే, ఐటీ మంత్రి)

**పూర్తికాల సభ్యులు**

1) వీకే సారస్వత్ (డీఆర్‌డీవో మాజీ చీఫ్)
2) రమేశ్ చంద్ (ఆర్థిక, వ్యవసాయ నిపుణులు)
3) వీకే పాల్ (ప్రజారోగ్య నిపుణులు)
4) అరవింద్ వీర్మానీ (ఆర్థిక రంగ నిపుణులు)

- ముఖ్య కార్యనిర్వహణ అధికారి– బీవీ ఆర్ సుబ్రమణ్యం

**గవర్నింగ్ కౌన్సిల్:** అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు

- శాసన సభ కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు (న్యూఢిల్లీ, పుదుచ్చేరి, జమ్ము, కశ్మీర్)
- కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు
- ఇప్పటి వరకు 8 సార్లు పాలక మండలి సమావేశాలు జరిగాయి.
  1) 2015, ఫిబ్రవరి 8
  2) 2015, జూలై 15
  3) 2017, ఏప్రిల్ 23
  4) 2018, జూన్ 17
  5) 2019, జూన్ 15
  6) 2021, ఫిబ్రవరి 20
  7) 2022, ఆగస్టు 7
  8) 2023, మే 27

**నీతి ఆయోగ్ విడుదల చేసిన సూచీలు**

## భారత ఆవిష్కరణల సూచీ (ఇండియా ఇన్నోవేషన్ ఇండెక్స్)- 2020

- ఈ సూచీని 2021, జనవరి 20న అప్పటి నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్‌కుమార్, సీఈవో అమితాబ్ కాంత్ ఢిల్లీలో విడుదల చేశారు.
- 7 అంశాలను ప్రామాణికంగా తీసుకొని ఈ సూచీని రూపొందిస్తారు.
  1) మానవ మూలధనం
  2) పెట్టుబడి 3) మేధో కార్మికులు
  4) వ్యాపార వాతావరణం
  5) భద్రత, చట్టపరమైన వాతావరణం
  6) విజ్ఞాన ప్రదర్శన 7) విజ్ఞాన విస్తరణ
- దేశంలో మొత్తం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను, 17 పెద్ద రాష్ట్రాలు, 10 ఈశాన్య, పర్వత ప్రాంత రాష్ట్రాలు, 9 నగర కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించి ర్యాంకులు ప్రకటించారు.

**పెద్ద రాష్ట్రాలు**

| ర్యాంక్ | స్కోర్ |
|---|---|
| 1. కర్ణాటక | 42.50 |
| 2. మహారాష్ట్ర | 38.03 |
| 3. తమిళనాడు | 37.91 |
| 4. తెలంగాణ | 33.23 |
| 16. ఛత్తీస్‌గఢ్ | 15.77 |
| 17. బిహార్ | 14.48 |

**ఈశాన్య, పర్వత ప్రాంత రాష్ట్రాలు**

| ర్యాంక్ | స్కోర్ |
|---|---|
| 1. హిమాచల్‌ప్రదేశ్ | 25.06 |
| 2. ఉత్తరాఖండ్ | 23.50 |
| 3. మణిపూర్ | 22.78 |
| 9. త్రిపుర | 12.84 |
| 10. మేఘాలయ | 12.15 |

**నగర, కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలు**

| ర్యాంకు | స్కోర్ |
|---|---|
| 1. ఢిల్లీ | 46.60 |
| 2. చండీగఢ్ | 38.57 |
| 3. డామన్, డయ్యూ | 26.76 |
| 8. జమ్మూ కశ్మీర్ | 18.62 |
| 9. లక్షద్వీప్ | 11.71 |




## స్కూల్ ఎడ్యుకేషన్ క్వాలిటీ ఇండెక్స్- 2019

- దేశంలోని వివిధ రాష్ట్రాల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ సూచీని రూపొందిస్తారు.

| రాష్ట్రం | ర్యాంకు |
|---|---|
| కేరళ | 1 |
| రాజస్థాన్ | 2 |
| కర్ణాటక | 3 |
| ఏపీ | 4 |
| తెలంగాణ | 14 |
| యూపీ | 20 |

- ఈ సూచీని 2019, సెప్టెంబర్ 30న విడుదల చేశారు. కొన్ని రాష్ట్రాల ర్యాంకులు.
- ఈ జాబితాలో పశ్చిమ బెంగాల్, మణిపూర్, త్రిపుర, మిజోరం, సిక్కిం, నాగాలాండ్, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, గోవా రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకోలేదు.

## ఆరోగ్య సూచీ (హెల్త్ ఇండెక్స్)

- 'ది హెల్తీ స్టేట్స్, ప్రోగ్రెసివ్ ఇండియా – హెల్త్ ఇండెక్స్' అనే పేరుతో నీతి ఆయోగ్ ఈ నివేదికను 2021, డిసెంబర్ 27న విడుదల చేసింది.
- కుటుంబ నియంత్రణ, నవజాత శిశు మరణాలు, ఐదేళ్లలోపు చిన్నారుల మరణం, స్త్రీ పురుష నిష్పత్తి తదితర 24 అంశాలను ప్రామాణికంగా తీసుకొని ఈ నివేదికను రూపొందించారు.
- పెద్ద రాష్ట్రంలో సమగ్రమైన పని తీరులో కేరళ 82.20 స్కోరుతో అగ్ర స్థానంలో ఉండగా, రెండో స్థానంలో తమిళనాడు (72.42), మూడో స్థానంలో తెలంగాణ (69.96), నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్ (69.95), చివరి (19వ) స్థానంలో ఉత్తర ప్రదేశ్ (30.57) ఉన్నాయి.
- చిన్న రాష్ట్రంలో మిజోరం తొలి స్థానంలో, రెండో స్థానంలో త్రిపుర ఉన్నాయి.
- కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ అగ్రస్థానంలో నిలిచాయి.

## బహుముఖ పేదరిక సూచీ (మల్టీ డైమెన్షనల్ పావర్టీ రిపోర్ట్)

- ఈ సూచీని మూడు అంశాల ఆధారంగా రూపొందించారు. అవి..
  1) ఆరోగ్యం 2) విద్య
  3) జీవన ప్రమాణాలు
- **ఆరోగ్యంలోని ఉప అంశాలు:** ఎ. శిశు మరణాలు బి. పౌష్టికాహార లభ్యత
- **విద్యలోని ఉప అంశాలు:** ఎ. పాఠశాల హాజరు బి. పాఠశాల సంవత్సరాలు
- **జీవన ప్రమాణంలోని ఉప అంశాలు:** ఎ. వంట గ్యాస్ బి. పారిశుద్ధ్యం సి. తాగునీరు డి. విద్యుత్ ఇ. గృహవసతి ఎఫ్. ఆస్తులు
- 2013–14లో దేశ పేదరికం– 29.1 శాతం
- 2022–23లో దేశ పేదరికం– 11.2 శాతం

**తక్కువ పేదరికం గల రాష్ట్రాలు**

1) కేరళ– 0.48 శాతం
2) తమిళనాడు– 1.43 శాతం
3) తెలంగాణ– 3.76 శాతం

**ఎక్కువ పేదరికం గల రాష్ట్రాలు**

1) బీహార్– 26.59 శాతం
2) జార్ఖండ్– 23.34 శాతం
3) ఉత్తరప్రదేశ్– 17.40 శాతం

## మాదిరి ప్రశ్నలు

1. కింది స్టేట్‌మెంట్లలో సరైనవి?
   1) ప్రణాళికా సంఘం స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేశారు
   2) ప్రస్తుతం నీతి ఆయోగ్‌కు ప్రధాన మంత్రి అధ్యక్షుడిగా ఉన్నారు
   3) ప్రస్తుత నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్ బేరీ 4) పైవన్నీ
2. నీతి ఆయోగ్‌ను ఏ విధంగా ఏర్పాటు చేశారు?
   1) రాష్ట్రపతి ఆర్డినెన్స్ ద్వారా
   2) పార్లమెంట్ చట్టం ద్వారా
   3) కేంద్ర క్యాబినెట్ తీర్మానం ద్వారా
   4) ఏదీకాదు
3. నీతి ఆయోగ్ నినాదం?
   1) వేగంతో కూడిన సుస్థిర సమ్మిళిత వృద్ధి
   2) శక్తిమంతమైన రాష్ట్రాలతోనే శక్తిమంతమైన దేశం
   3) శక్తిమంతమైన నూతన ఆలోచనలతో వేగవంతమైన వృద్ధి
   4) వికేంద్రీకరణతో కూడిన సుస్థిరాభివృద్ధి
4. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ (పాలక మండలి సభ్యులు)లో సభ్యులుగా ఎవరు ఉంటారు?
   ఎ. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు
   బి. అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు
   సి. కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు
   1) ఎ 2) ఎ, బి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
5. నీతి ఆయోగ్‌కు సంబంధించి సరైన వ్యాఖ్య?
   1) నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు వాస్తవ కార్యనిర్వాహక అధినేతగా ఉంటూ స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందిస్తాడు
   2) సహకార సమాఖ్య తత్వం (కో ఆపరేటివ్ ఫెడరలిజం) నీతి ఆయోగ్‌లో ఒక ప్రధానాంశం
   3) నీతి ఆయోగ్ రూపొందించిన అభివృద్ధి పథకాల్లో అన్ని రాష్ట్రాలకు ప్రధాన పాత్ర ఉంటుంది 4) పైవన్నీ
6. కింది వాటిలో సరైనదాన్ని గుర్తించండి?
   ఎ. ప్రణాళికా సంఘంతో పోలిస్తే నీతి ఆయోగ్‌లో రాష్ట్రాలు మరింత కీలక పాత్ర పోషిస్తాయి
   బి. విధానాల రూపకల్పన, ఆర్థిక సలహాల విషయాల్లో నీతి ఆయోగ్ తప్పనిసరిగా రాష్ట్రాలను సంప్రదించాలి. వారి ఆమోదంతోనే తుది విధానాన్ని రూపొందిస్తారు
   1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు
7. కింది వాటిలో సరైనదాన్ని గుర్తించండి?
   ఎ. నిధులు కేటాయించే అధికారం నీతి ఆయోగ్‌కు లేదు
   బి. నీతి ఆయోగ్ కేవలం సలహా సంఘమే. తాను రూపొందించిన విధానాలను అమలు చేసే అధికారం దీనికి లేదు
   1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు

**సమాధానాలు**

1–4, 2–3, 3–2, 4–3,
5–4, 6–3, 7–3.

పన్నాల శ్రవణ్ కుమార్
ఎకనామిక్స్ ఫ్యాకల్టీ,
9866709280
హైదరాబాద్

